www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 8 జూన్ 2025
5
తిరుపతి





బక్రీద్ పండగ సందర్భంగా ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులను ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర గ్రీన్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ



9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జులై 9న బుధవారం దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, కోశాధికారి కెఎస్ఎన్ ప్రసాదరావు పాల్గొన్నారు. కందారపు మురళి మాట్లాడుతూ దేశంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి, లేబర్‌కోడ్‌లుగా మార్చిందని, కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక హక్కులు రద్దయ్యాయని అన్నారు. లేబర్‌కోడ్‌ల అమలుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పూనుకోవడం దారుణమని విమర్శించారు. పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేయడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలో కనీస వేతనాలు నిర్ణయించి 13 సంవత్సరాలు అయిందని, షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేసే లక్షలాదిమంది కార్మికులకు వేతనాలు పెంచి 15 ఏళ్లు అయిందని విమర్శించారు. వేతనాలు పెంచడంలో లేని శ్రద్ధ కార్మికుల పనిగంటలు పెంచడంలో చంద్రబాబు ప్రభుత్వం పోటీ పడటం అన్యాయమని ఆయన అన్నారు. జూలై 9న సార్వత్రిక సమ్మె జయప్రదం తో పాటు డిసెంబర్ 31, జనవరి 1, 2, 3 4 తేదీలలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని విస్తత సమావేశం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో టి.సుబ్రమణ్యం, ఎ.పుల్లయ్య, రామకృష్ణ, ఆర్.లక్ష్మి, మునిరాజ, మాధవ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.



ఈశాన్యేశ్వర ఆలయంలో రాజీవ్ కనకాల దంపతులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ తిరుమల నగర్ లో ఉన్న ఈశానేశ్వర ఆలయాన్ని ప్రముఖ సినీనటులు రాజీవ్ కనకాల, సుమ దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కేతారి సహదేవ, ఆలయ అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ యాంకర్ సుమ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో శ్రీవారి పాదాల చెంత అద్భుతమైన నవలింగాలతో ఈశానేశ్వర ఆలయం నిర్మించడం అద్భుతంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా నవగ్రహాలను శివలింగాల రూపంలో ప్రతిష్ఠించడం విశేషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేతారి ప్రహ్లాద, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రాజీవ్ కనకాల, సుమ దంపతులను టిడిపి నాయకులు మర్రిపాటి సతీష్ సత్కరించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

నదిలో మునిగి ఇద్దరు పిల్లలు మృతి

పెళ్లకూరులో ఘటన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా)

ఈత సరదా ఇద్దరు చిన్నారుల ప్రాణాలను బలిగొంది. ఈ విషాద ఘటన తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం కలవకూరు స్వర్ణముఖి నదిలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి పోతే.. శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్తరాశిపాలెంలో లక్ష్మికి కలవకూరులో బంధువులు ఉన్నారు. తరచూ అక్కడికి వెళ్లి వస్తుంటుంది. ఈ క్రమంలో స్వర్ణముఖి నదిలోని చెక్ డ్యామ్ పై నీరు పారడాన్ని గుర్తించింది. ఈ నేపథ్యంలో చంద్రగిరి మండలం సత్తారుబైలు నుంచి వేసవి సెలవులకు శ్రీకాళహస్తికి వచ్చిన మనమరాలు(కూతురు బిడ్డ) నందినిని తీసుకుని ఆటవిడుపుగా ఉంటుందని కలవకూరు చెక్ డ్యామ్ కు ఆటోలో బయలు దేరింది. ఈ సమయంలో తామూ వస్తామనీ చుట్టుపక్కల పిల్లలు మారాం చేయడంతో వారినీ వెంట తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో నదిలోని చెక్ డ్యామ్ వద్ద ఈత కొడుతుండగా నందిని(7), లిఖిత్(14) ఇసుకలో కాళ్లు కూరుకు పోయి, పైకి రాలేక, ఊపిరి ఆడక మృతి చెందారు. కొనఊపిరి ఉంటుందేమోనన్న అనుమానంతో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో చిన్నారుల మృతదేహాలను వారి వారి స్వస్థలాలకు తరలించారు. లిఖిత్ ది శ్రీకాళహస్తి పట్టణంలోని సాలిపేట కాగా, తండ్రి దీనదయాళ్ ల్యాంకో పరిశ్రమలో సెక్యూరిటీ గార్డ్ గా పనిచేస్తున్నారు. చిన్నారుల మతి వార్త తెలుసుకుని ముత్తారాశి పాలెం, సాలిపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. నందిని మృతదేహాన్ని సత్తారు బయలు లో ఉన్న తండ్రి రమేష్ కు అప్పగించారు. పెళ్లకూరు మండల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.






ఒలంపియాడ్, టెక్నో, ఈ టెక్నో ఐఐటి అంటూ..

'టెక్కు'ల బిజినెస్

ఫీజుల నియంత్రణ పట్టని అధికారులు

పేరెంట్స్ కమిటీలపై మీనమేషాలు



ప్రజాశక్తి- తిరుపతి

ఉమాపతి కుటుంబం ఇటీవలే తిరుపతిలోని అబ్బన్న కాలనీలోకి కాపురం వచ్చాడు. తన కొడుకు 6వ తరగతి చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో గూగుల్‌లో ' బెస్ట్ స్కూల్ ఇన్ తిరుపతి ' అని సెర్చ్ చేశాడు. వచ్చిన స్కూల్స్‌కు సంబంధించిన రేటింగ్స్ చూస్తున్నాడు. రెండు మూడు నిమిషాలకే ఓ కార్పొరేట్ కాలేజీ నుంచి ఫోన్ వచ్చింది. ' సార్...మాది ఒలంపియాడ్ అండ్ టెక్నో స్కూల్ సార్. తిరుపతి మార్కెట్ రోడ్డులోనే మా స్కూల్ ఉంది. మా స్కూల్‌లో చదివిన వాళ్లే ఈ రోజు టెన్త్‌లో స్టేట్ టాపర్స్‌గా ఉన్నారు. ఐఐటి, జేఈఈ, నీట్ లాంటి వాటికీ ఇప్పటినుంచే తర్ఫీదు నిస్తాం. తప్పకుండా మా స్కూల్ ప్రాస్పెక్టరీస్ చూడండి. ఆన్‌లైన్‌లో కూడా టాప్‌లో మేమే ఉంటాం. మీరు టైం ఇస్తే 15 నిమిషాల్లో మీ అడ్రెస్‌కే మా పిఆర్‌ఓ వస్తారు.' అంటూ తమ స్కూల్ గొప్పదనం గురించి మాట్లాడుతూనే ఉంది. ఆ కాల్ లైన్‌లో ఉండగానే మరో నెంబర్‌నుంచి కాల్ వెయిటింగ్ కంటిన్యూస్‌గా వస్తోంది. 'నాకేదో అర్జంట్ కాల్ వస్తోంది..మేమే మీ స్కూల్‌కి వస్తాం.' అంటూ మొదటి ఫోన్ కాల్ కట్ చేయగానే. ఇది వరకు వెయిటింగ్‌లో ఉన్న కాల్ కనెక్ట్ అయ్యింది. ఆ కాల్ ఆన్సర్ చేయగానే ' సార్ ...మీరు తిరుపతిలో ఓ మంచి కార్పొరేట్ స్కూల్ కోసం వెదుకుతున్నారు కదా..!. మీకు మా స్కూల్ అయితేనే ది బెస్ట్ స్కూల్ సార్....' అంటూ ప్రారంభించి కంటిన్యూగా 15 నిమిషాల పాటు ఆ టెక్నో స్కూల్ ప్రతినిధి మాట్లాడుతూ..ఆ స్కూల్ గొప్పతనం గురించి వర్ణిస్తోంది. ఈ లోపు ఇంకో ఐఐటి స్కూల్ నుంచి ఫోన్ కాల్ ఇలా కంటిన్యూగా ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయి. ఇలా ఉమాపతి ఫోన్ లో ఉండగానే ' ఇంటి కాలింగ్ బెల్ మోగింది. వెళ్లి తలుపుతీయగా తొలుతగా మాట్లాడిన ఆ కార్పొరేట్ స్కూల్ నుంచి పిఆర్‌ఓ అంటూ వచ్చిన ఓ వ్యక్తి పిల్లాడి వివరాలు తెలుసుకుంటూనే ' అడ్మిషన్ ఫారం' పూర్తి చేసి.. మీ కోసం స్పెషల్ ఆఫర్ సార్..అడ్మిషన్ ఫీజులో 50 శాతం రాయితీ కూడా ఇస్తున్నాం. అడ్వాన్స్ పే చేయండి అంటూ ఉమాపతి వెంటబడ్డారు. ఇలాంటి ఘటనలు ఉమాపతికి ఒక్కరికే కాదు..ఆన్‌లైన్‌లో బెస్ట్ స్కూల్ అని టైప్ చేసే ప్రతి ఒక్కరి వెంటా ఆ కార్పొరేట్ పాఠశాలలు పడుతుండటమే కాదు... ఆస్కూల్ పేరు వెనుక ఒలంపియాడ్, ఐఐటి, టెక్నో, ఈ టెక్నో అంటూ తోకలు తగిలించుకుని మరీ వెంటాడుతుండటం గమనార్హం.


సిబిఎస్ఇ పై మోజు, కార్పొరేటు స్కూళ్లపై వ్యామోహంతో ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఇదే అదనుగా భావించి ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు స్కూల్ పేర్ల చివరన టెక్నో, ఈ టెక్నో, ఐఐటి, ఒలంపియాడ్, మోడల్, డిజిటల్, ఇంటర్నేషనల్, కాన్సెప్ట్ అంటూ తోకలు చేర్చి మరీ విద్యార్థుల తల్లిదండ్రులను బోల్తా కొట్టిస్తున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ పేర్ల చివర కేవలం ప్రైవేటు అనే ఉండాలి. తోక పేర్లు ఉండొద్దని ప్రభుత్వం ఆదేశాలిచ్చినా ఈ నిబంధన అమలు కావడం లేదు. ఇప్పటికీ అనేక బడులకు తోకపేర్లు దర్శనమిస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని స్కూళ్లు బయట బోర్డు, బస్సులపై తొలగించినా, పేరెంట్స్‌కు పంపించే లెటర్లు, స్టూడెంట్స్ బుక్స్‌లో అవే దర్శనమిస్తున్నాయి. ఈ పేర్లతోనే కార్పొరేట్ మేనేజ్మెంట్లు పేరెంట్స్ నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

ఫీజులపై నియంత్రణేదీ?

ఫీజుల నియంత్రణలోనూ ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అయితే నిబంధనలను పక్కన బెట్టి ఈ విద్యాసంవత్సరాని (2025- 26)కి గాను పలు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు భారీగా పెంచాయి. ప్రస్తుతం ఉన్న ఫీజుల కంటే 15 నుంచి 20శాతం వరకు పెంచినట్లు విద్యార్థి సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. సీబీఎస్ఈ సిలబస్ అంటూ ఈ ఏడాది (2025-26) 1వ తరగతి నుంచి 3వ తరగతి వరకు రూ.70వేల నుంచి రూ.90వేలు, 4వ తరగతి నుంచి 6వ తరగతి వరకు రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, రూ.80 వేలు నుంచి లక్షా ఇరవై వేల వరకు ఫీజులు వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. మంగళంలో ఇటీవలే ఏర్పాటు చేసిన ఓ ప్రముఖ సిబిఎస్ఇ విద్యాసంస్థలో టర్మ్ ఫీజులను వసూలు చేసి మరీ అడ్మిషన్లను ముగించేయడం గమనార్హం. ప్రతిఏడాదీ ఆయా పాఠశాలల యాజమాన్యాలు 20 శాతం నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచుతూనే ఉన్నా విద్యాశాఖ అధికారులు మాత్రం తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పేరెంట్స్ కమిటీలపై మీనమేషాలు

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల విషయంలో సరైన నియంత్రణ లేకపోవడంవల్ల పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఫీజుల విషయంలో ఈ కమిటీ నిర్ణయం తీసుకోవాలి. అలాంటిది ఏ ఒక్క పాఠశాలలో అమలు కావడం లేదు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల విషయంలో ఒక్కసారి కూడా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ సారైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పేరెంట్స్ కమిటీలను పటిష్ఠంగా అమలు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.



'తోకలు' తీయాల్సిందే

భగత్ రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి

స్కూల్స్ పేరు వెనుకాల టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్ అంటూ తోకలు ఉండకూడదని నిబంధనలున్నాయి. అయినా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు ఆ తోకల్ని ఎరగా చూపి పేద, మధ్యతరగతి విద్యార్థుల్ని మభ్యపెడుతూ వేలాది రూపాయలు దోచుకుంటున్నారు. ఈ విషయం తెలిసినా విద్యాశాఖ అధికారులు మాత్రం తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్కూల్ పేర్ల వెనుక ఉన్న తోకలు తీయించాల్సిందే. లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతాం

'అలెన్'తో ప్రైవేట్ కాలేజీలు 'అలయన్స్'

ఎస్ఎఫ్ఐ స్టింగ్ ఆపరేషన్‌లో వెలుగులోకి...

ఒక్కో విద్యార్థికి 3లక్షల 39వేలు వసూలు

ప్రజాశక్తి - తిరుపతి

తిరుపతి జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో కోచింగ్ మాఫియా రాజ్యమేలుతోందన్న విమర్శలు ఎస్ఎఫ్ఐ ఆధారాలతో సహా బయట పెట్టింది. తక్షణమే ఇలాంటి కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, రవి, ఆఫీసు బేరర్స్ వినోద్, అశోక్, తేజ డిమాండ్‌చేశారు. తిరుపతి నగరంలో కోచింగ్ మాఫియాలు ప్రైవేట్ జూనియర్ కాలేజీలతో చేతులు కలిపాయి. అలెన్ కెరియర్ ఇన్‌స్టిట్యూట్ కోట, రాజస్థాన్ పేరుతో 'నీట్ యూజీ-జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్, ఒలంపియాడ్స్ 6వ తరగతి నుంచి 12వ తరగతి పేరుతో తిరుపతి నగరంలో కోచింగ్ మాఫియాను ప్రారంభించింది. ఈ కోచింగ్ మాఫియాతో రాజు జూనియర్ కాలేజీ (09382), శ్రీనివాస జూనియర్ కాలేజీ (09316) చేతులు కలిపి లక్షా యాభైవేల నుంచి 3 లక్షల 30వేల వరకూ ఫీజులు వసూలు చేస్తున్నాయి. రాజు జూనియర్ కాలేజీ (09382) ఎయిర్ బైపాస్‌రోడ్డు బజాజ్ షోరూమ్‌పైన డేస్కాలర్స్ విద్యార్థుల నుంచి లక్షా 50వేలు ఫీజు వసూలు చేస్తోంది. శ్రీనివాస జూనియర్ కాలేజీ (09316) తిరుపతి రూరల్‌లో అలెన్ హాస్టల్ క్యాంపస్ తరగతులు నిర్వహిస్తూ ఒక్కో విద్యార్థి నుంచి మూడు లక్షలు వసూలు చేస్తోంది. హాస్టల్ కోసం లక్షా 20వేలు, అలెన్ ఫీజు లక్షా 67వేలు, శ్రీనివాస జూనియర్ కాలేజీ (ఇంటర్) 37వేలు, దోబీ ఫీజు ఐదువేలు, సెక్యూరిటీ డిపాజిట్ పదివేలు కలిపి మొత్తం 3 లక్షల 39వేలు ఒక్కో విద్యార్థి నుంచి వసూలు చేస్తుండటం గమనార్హం. ఏ ప్రైవేట్ జూనియర్ కళాశాల అయినా బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ అనుమతితో నడుస్తుంటే ఆ ప్రైవేట్ జూనియర్ కళాశాల ఎటువంటి ప్రైవేట్ కోచింగ్ సెంటర్లతో ఒప్పందం చేసుకోకూడదు. అలెన్ కోచింగ్ మాఫియాతో ఒప్పందం చేసుకుని రాజు, శ్రీనివాస జూనియర్ కాలేజీలు నిబంధనలకు వ్యతిరేకంగా చెలామణి అవుతున్నాయి.గతంలో అనేకమార్లు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపామన్నారు. అయినా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోలేదు. ఇకనైనా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఆర్ఐఒ రాజశేఖర్‌రెడ్డి ఈ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





తిరుపతి జిల్లా గూడూరు, తొట్టంబేడుల్లో... ఉపాధ్యాయ జేపీసీ ఆధ్వర్యంలో నిరసనలు

ఉపాధ్యాయ బదిలీలు మాన్యువల్‌గా నిర్వహించాలి

ప్రజాశక్తి - తిరుపతి , యంత్రాంగం

పాఠశాల విద్యాకార్యదర్శి కోన శశిధర్ సమక్షంలో జరిగిన చర్చల సందర్భంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేపట్టడానికి అంగీకరించారని, అయితే ఎస్‌జిటిలకు మరలా వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలని శుక్రవారం రాత్రి ఎనేబుల్ చేయడం హామీని ఉల్లంఘించడం అవుతుందని ఉపాధ్యాయ జేఏసీ అభిప్రాయపడింది. అంతేకాకుండా ప్రధానోపాధ్యాయులు, స్కూలు అసిస్టెంట్లకు ఇప్పటివరకూ జరిగిన బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియలో అనేక సాంకేతికపరమైన సమస్యలు తలెత్తడంతో చాలా మంది ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు. వీరికి న్యాయం చేయాలన్నారు. కొన్ని ఖాళీలను సీనియర్లు ముందుగా బదిలీ కోసం ఎంపిక చేసుకున్నప్పటికీ వారికి కేటాయించకుండా జూనియర్లకు కేటాయించారన్నారు. పై సమస్యలను పరిష్కరించని పక్షంలో 8వ తేదీ ఆదివారం డిఇఒ కార్యాలయాల ముట్టడికి పిలుపునిచ్చినట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర స్టీరింగ్ కమిటి సభ్యులు అపస్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాలాజీ, యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి రమణ,

నేడు డిఇఒ కార్యాలయ ముట్టడికి జేపీసీ పిలుపు

ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎన్ఆర్ మదన్‌మోహన్‌రెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మణిగండన్, పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ఆర్‌టిఎ జిల్లా అధ్యక్షులు ఎం.గోవిందస్వామి, ప్రధాన కార్యదర్శి జయకాంత్, అపస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు నాగరాజ, పిఆర్‌టియు వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంద్ర రెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఏకాంబరం, ఎస్‌టియు నాయకులు చంద్రన్ పేర్కొన్నారు.

- శ్రీకాళహస్తి : ఉపాధ్యాయులకు ఇచ్చిన ఒప్పందం ప్రకారం సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సిలింగ్ విధానాన్ని అమలు పరచాలని, వెబ్ కౌన్సిలింగ్ లో జరిగిన అన్యాయాన్ని సరి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శనివారం తొట్టంబేడు మండలం ఎంఆర్సి వద్ద ఉపాధ్యాయ ఐక్య సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ప్రభుత్వం మాట నిలబెట్టుకోకుంటే తగు పర్యావసానాలు తప్పవని హెచ్చరించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక బాధ్యులు బి మురళీకష్ణ, జి శ్రీనివాసులు, ఏ మోహన్ బాబు, దేవేంద్ర, సుబ్రహ్మణ్యం రెడ్డి, శివ, రామదాసు, సుబ్బయ్య, బి. విజయ తదితరులు పాల్గొన్నారు.

- గూడూరులో ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సెకండ్‌గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలు మాన్యువల్‌గా చేయాలని, వెబ్‌కౌన్సిలింగ్ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. వెబ్‌ఆప్షన్ల ద్వారా బదిలీలను నిలుపుదల చేయాలని నినాదాలు చేశారు. సోమవారం అన్ని జిల్లా కేంద్రాలలో డిఇఒ కార్యాలయాల ముట్టడి నిర్వహిస్తున్నామన్నారు.

- రామచంద్రాపురం ఎంఆర్‌సి కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల వద్ద ముట్టడించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, రెడ్డి ప్రసాద్, వెకంటేశ్వర్‌రెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, రామిరెడ్డి, మోహన్, ప్రసన్నకుమార్, చెంచయ్య, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ర్యాలీల జోరు... విమర్శల హోరు..!

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా అధికార కూటమి విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు జరుపుకుంది. మరో పక్క కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిందేమి లేదంటూ వైసిపి నయవంచన (వెన్నుపోటు) దినం పేరుతో నిరసన ర్యాలీలు, సభలు నిర్వహించింది. జిల్లాలో అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం పోటాపోటీ ర్యాలీలు చేపట్టింది. ప్రజలను పోగుచేసి వారి జెండాలను మోసేందుకు, వారికి జేజేలు కొట్టేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహించారే తప్ప, సామాన్యుడికి దీని వల్ల ఒరిగిందేంటూ ప్రజలే బహిరంగంగా విమర్శలు చేయడం గమనార్హం.

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌సిపి ఒటమితో కూటమి ప్రభుత్వం (టిడిపి, జనసేన, బిజెపి) గద్దెనెక్కి ఏడాది పూర్తయింది. తాము అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజలకు అది చేస్తాం, ఇది చేస్తామంటూ అనేక హామీలు ఇచ్చింది. ఒక దశలో రాష్ట్రాన్ని ఏకంగా దేశానికి ఆదర్శంగా నిలుపుతామంటూ కూటమి నాయకులు తొడలు కొట్టారు. దీంతో కూటమికి ప్రజలు అత్యధిక మోజార్జీ అందించారు. కూటమి అధికారంలోకి రావడం, చంద్రబాబు ముఖ్యమంత్రి, జనసేనాని పవన్‌కల్యాణ్ డిప్యూటీ సిఎం కావడం చకచకా జరిగిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. కానీ ఇచ్చిన హామీలు అమలు కాలేదు. సూపర్‌సిక్స్ జాడలేదు. ఉచిత బస్సు అమలు కాలేదు. మహిళలు, యువకులు, వృద్ధులు, పిల్లలు, ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగులు ఇలా ఎవ్వరికి ఏ మాత్రం న్యాయం జరగలేదు. అధికార మార్పిడి జరిగిన తర్వాత రాష్ట్రంలో ఏదైనా మార్పు జరిగిందంటే ఆగమేఘాలపైన ప్రభుత్వం అధీనంలో ఉన్న మద్యం దుకాణాలను ప్రయివేట్ పరం చేయడంమే. వీధికొక్క బ్రాందీషాపు, సందుకొక్క బెల్టు షాపులు తెరిచి, అన్ని రకాల బ్రాండులను అందుబాటులో ఉంచి, ప్రజలను తాగుడుకు మరింత బానిసలను చేశారు. ఏడాది పాటు ఈ విధానాన్ని నిశితంగా పరిశీలించిన వైసిపి తిరుపతి జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రంలో మద్యం షాపుల నిర్వహణ తీరు తెన్నెలపై స్టింగ్ ఆపరేషన్ చేసింది. 24 గంటలు మద్యం అమ్మకాలు, అధిక ధరలు, షాపు పక్కనే పెద్ద పెద్దగదుల్లో బార్లను తలపించే బెల్టుషాపుల నిర్వహణను కెమెరాల్లో బంధించి, ప్రజలకు, ఎక్సైజ్ అధికారులు, అటు ప్రభుత్వానికి పంపి ఏంటి ఈ తీరు అని ప్రశ్నించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా బెల్టు షాపులు మూసివేశారు. మద్యంషాపుల సమయపాలనపై సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. ఈ పరిణామాలతో ఎలాగైన కూటమి ప్రభుత్వాన్ని మరింత ఇరుకున పెట్టాలని వైసిపి వెన్నుపోటు దినం పేరుతో 4వ తేది జిల్లా వ్యాప్తంగా నిరసన ర్యాలీలు చేపట్టారు. తిరుపతిలో టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, చంద్రగిరిలో తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, శ్రీకాళహస్తిలో బియ్యపు మదుసూధన్‌రెడ్డి, నగరిలో మాజీ మంత్రి ఆర్‌కె రోజు ఆధ్వర్యంలో ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనాన్ని భారీ సంఖ్యలో పోగు చేసి వైసిపి జెండాలు మోయిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయిస్తూ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించారు. ప్రతిపక్షం తీరుతో అప్రమత్తమైన అధికార పార్టీలు ఏడాది పాలన పూర్తియిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీలు, కేక్ కటింగ్‌లు, బాణాసంచా పేల్చడం, వంటి సంబరాలు జరుపుకున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు పోటా పోటీ ర్యాలీలు, సంబరాలు, సభలతో జిల్లా అంతటా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఇరు పక్షాల వారు జనాలను బాగానే పోగు చేశారు. అందులో ప్రతిపక్షం నాలుగాకులు ఎక్కువే చేసింది. ర్యాలీలకు, సభలకు వచ్చిన జనాలకు బహిరంగంగానే నగదు పంపిణీ చేయడం కొసమెరుపు. అధికారపార్టీ ఆగడాలను ఎండగడుతూ, ప్రజా సమస్యలపై గళమెత్తుతూ, ప్రభుత్వాన్ని నిలదీస్తూ నిత్యం ప్రజల కోసం పోరాడుతూ కమ్యూనిస్టులు మాత్రమే నిలబడడం గమనార్హం. ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ఈ వారంలో 'సమైక్యతా ర్యాలీలను' సిపిఎం, సిపిఐ నిర్వహించాయి. ఇకనైన కూటమీ ప్రభుత్వం పునరాలోచించి ఎన్నికల హామీలను నెరవేర్చాల్సి ఉంది.

సెక్యూరిటీ వసూళ్లపై బృందమ్మ ఫైర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన ఒక సెక్యూరిటీ గార్డు భక్తుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తుండగా స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి బందమ్మ శనివారం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఆయన్ను తీవ్రంగా మందలించారు. ఆయనపై అధికారులకు ఫిర్యాదు చేయడంతో విధుల నుంచి తొలగించారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి సతీమణి బందమ్మ శనివారం శ్రీకాళహస్తి పట్టణంలో పలుచోట్ల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తిరిగి స్వగ్రామమైన శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వెళుతూ శివయ్య గోపురం వద్ద ఉన్న షెడ్లను పరిశీలించారు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న సెక్యూరిటీ గార్డు సుబ్రమణ్యం నాయుడు షెడ్లలో నిద్రించే భక్తుల నుంచి 20 రూపాయలు వసూలు చేస్తుండడాన్ని గమనించారు. ఆయనపై తీవ్రంగా మండిపడ్డారు. అతడిని అక్కడి నుంచి తరిమేశారు. సెక్యూరిటీ గార్డు భక్తుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే విధుల నుంచి అధికారులు ఆయన్ను తొలగించారు.

మాజీ అదనపు ఈవో ధర్మారెడ్డిని సిట్ విచారించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి అంశంపై సిట్ అధికారులు టీటీడీ మాజీ అదనపు ఈవో ధర్మారెడ్డిని విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని జనసేన నేత కిరణ్ రాయల్ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీవారికి ప్రీతిపాత్రమైన ప్రసాదంగా చెప్పబడే లడ్డులో కల్తీ నెయ్యిని వినియోగించి కోట్లాదిమంది భక్తులకు సరఫరా చేశారని, దీని వెనుక ఉన్న కుట్ర దారులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కింది స్థాయి ఉద్యోగులను ఇబ్బంది పెట్టకుండా, అసలు సూత్రధారులను సిట్ అధికారులు కొనుగోళ్ల కమిటీ వారిని కూడా విచారణ పరిధిలోకి తీసుకోవాలని కోరారు. కల్తీ నెయ్యి అంశం వెనుక ఒకరిద్దరు మీడియాకు సంబంధించిన వారు, బోర్డు సభ్యులు కూడా ఉన్నారని సంచలనంగా మాట్లాడారు. కల్తీ నెయ్యి అంశం మతపరమైన దాడిగానే పరిగణిస్తున్నామన్నారు. ఏదేమైనా ప్రభుత్వం నియమించిన సిట్ అధికారులు కల్తీ నెయ్యి వెనుక ఉన్న కుట్రదారులను గుర్తించడంలో వేగవంతంగా పనిచేస్తున్నారన్నారు.

శ్రీకాళహస్తి సిడిపిఓగా కె.రాజేశ్వరి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓగా కె.రాజేశ్వరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా పుంగనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓగా విధులు నిర్వహిస్తున్న కె.రాజేశ్వరిని శ్రీకాళహస్తికి బదిలీ చేశారు. శ్రీకాళహస్తి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓగా విధులు నిర్వహిస్తున్న బి.శాంతిదుర్గను సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలోని శాంతిపురానికి బదిలీ చేశారు.

ఆధునిక వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించండి

ప్రజాశక్తి - రామచంద్రపురం: రైతులు ఆధునిక వ్యవసాయ యాజమాన్య పద్ధతులను అలవర్చుకుని, పంటలు సాగు చేస్తే అధిక లాభాలను పొందువచ్చని ఐ.సి.ఎ.ఆర్ శాస్త్రవేత్త భరత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మిట్టూరు కమ్యూనిటీ హాల్లో కమ్మ కండ్రిగ పంచాయతీ రైతులకు రాస్ కె.వి.కె ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్లో అధిక దిగుబడినిచ్చే ప్రధాన పంటలను సాగు చేసి, యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. ఆర్ ఎ.ఆర్ యస్ వ్యవసాయ అధికారి మహేశ్వర్ రెడ్డి, వ్యవసాయ అధికారి వేణుగోపాల్, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం పశు వైద్య శాస్త్రవేత్త డి.అనూషలు మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రాముఖ్యత, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రధాన్యత, ఎరువుల వాడకం వంటివాటిపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజలు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న శాస్త్రవేత్త శ్రీ రాము కుమార్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వ్యవసాయంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా సాగు ఖర్చు తగ్గించు కొని మంచి దిగుబడులు సాధించవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త శ్రీ రాము కుమార్ తెలిపారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, తిరుపతి వారు భారత వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, న్యూ ఢిల్లీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "వికసిత్ కృషి సంకల్ప అభియాన్" లో భాగంగా శనివారం వడమాలపేట మండలం, టి.సి.అగ్రహారం, యల్లంకండ్రిగ, పాదిరేడు గ్రామాలలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, రైతుల చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిక్షణ కేంద్రం శ్రీనివాసులు, వడమాల పేట మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, మండల టిడిపి వైస్ ప్రెసిడెంట్ దామోదరం, రైతు సేవా కేంద్ర సిబ్బంది సాగర్, యమునా, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కోట: నిరుద్యోగ యువతి యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని స్థానిక ఎస్ఐ పవన్ కుమార్ ఆకాంక్షించారు. శనివారం కోట మండలం, విద్యానగర్, శ్రీనివాస స్కూల్లో ఆన్ బిన్ సువడగల్ సంస్థ ఆధ్వర్యంలో చెన్నైకి చెందిన ప్రముఖ కంపెనీల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని కోట ఎస్ఐ పవన్ కుమార్ చేతులమీదుగా ప్రారంభించారు. సంస్థ డైరెక్టర్ భూపతి మోహన్ సాయి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఇంకా అనేక విధాలైన జాబ్ మేళాలు నిర్వహిస్తామని, మూడు మండలాల ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ భూపతి మోహన్ సాయి, శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ నీలం సురేంద్ర రెడ్డి, చెందోడు మాజీ ఎంపీటీసీ బోధనపు బాల సుబ్రమణ్యం, న్యాయవాదులు పి.వి.రమణయ్య, సురేష్, దాసరి అశోక్ కాంబ్లీ, యువతీ యువకులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఈ ఏడాది ఖరీఫ్లో సాధారణ సాగు విస్తీర్ణం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు ఖరీఫ్ ప్రణాళికలను సిద్ధం చేశారు. గ్రామాల్లో వ్యవసాయ సదస్సులు నిర్వహించి పంటల సాగుపై రైతులకు సూచనలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట, ఎరువు, సాగుకు విత్తనాలు పంపిణీ వ్యవసాయ శాఖ చేపట్టింది. పిల్లి పెసర, జనుము, జీలుగ విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారిణి భారతి తెలిపారు. సకాలంలో వర్షాలు కురవటం, తెలుగు గంగ జలాశయం నిండటంతో వరి, మిరప పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది, మిరప, వరి విత్తనాలను పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. వర్షాలు కురవగానే వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. రైతుల అవసరాల మేరకు ఏపీ సీడ్స్ వద్ద విత్తన నిల్వలు లేవు. విత్తన లేమితో రైతులు ఇబ్బంది పడే పరిస్థితి రాకుండా, సంబంధిత ఉన్నతాధికారులు విత్తన నిల్వలపై దృష్టి సారించాలని మండల రైతులు కోరుతున్నారు.

యోగాతో ఆరోగ్యకరమైన జీవన విధానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : యోగా అనేది కేవలం వ్యాయామమే కాదని, ఆరోగ్యకరమైన జీవన విధానమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి పేర్కొన్నారు. శనివారం కళాశాలలో యోగాంధ్ర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య, వీరయ్య, నరసింహులు, దేవకి, నాగేశ్వరావు తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, ఎన్సిసి క్యాడేట్స్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు 30 మందికి పౌష్టికా హారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యకులు కడివేటి చంద్ర శేఖర్ మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా డాక్టర్ సి.ఆర్ రెడ్డి ఆరోగ్య సంజీవని కార్యక్రమం ద్వారా డాక్టర్ జనార్ధన్ రెడ్డి, డాక్టర్ రోహిణి సహకారాలతో పౌష్టికాహార పంపినీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పాజిటివ్ నెట్వర్క్ ప్రెసిడెంట్ ధనుర్జ, డాక్టర్ హరీష్ రెడ్డి, సాయి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని మోదుగుపాలెం పంచాయతీ, కుమ్మరి మిట్టలో గత కొన్ని రోజులుగా తాగునీటి బోరు మరమ్మతులకు గురి కావడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం టిడిపి భూత్ ఇంచార్జ్ నాగూర్ నాయుడు పర్యవేక్షణలో బోరు మరమ్మతులు చేయించారు. దీంతో గ్రామస్తులు తాగు నీటి ఇబ్బందిని తీర్చిన నాగూర్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిని కనుమనంబేడు గ్రామపంచాయతీకి చెందిన కొంతమంది గత కొన్ని రోజులుగా ఆక్రమించుకొని, గుడిసెలు వేసుకునే ప్రయత్నాలు చేశారు. ఈ విషయం తహశీల్దార్ శ్రీదేవి ఆర్డీవోకు, కలెక్టర్కు తెలియపరిచారు. ఈ భూమి ప్రభుత్వ భూమి అని, ఇది మండల కాంప్లెక్స్కు సంబంధించినదని అధికారులు నిర్ధారించారు. శనివారం బక్రీద్ పండగ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవుదినం కావడంతో, అధికారులు విధులకు రారని ఊహించి గ్రామస్తులు ఆ స్థలంలో రాళ్లు తెచ్చి నాటి, ఇల్లు కట్టుటకు భూమి పూజ చేశారు. విషయం తెలుసుకున్న తాసిల్దార్ వెంటనే స్పందించి, పోలీసు శాఖకు సమాచారం ఇవ్వగా, పోలీసు సిబ్బంది జెసిపితో వచ్చి గ్రామస్తులు వేసిన గుడిసెలు తొలగించారు. అనంతరం హెచ్చరిక బోర్డులు నాటించారు. ఈ నేపథ్యంలో తహశీల్దారు మాట్లాడుతూ ఈ భూమిలో ఎవరైనా అక్రమంగా కట్టడాలు కట్టినా, రాళ్లు నాటినా వారి పైన చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ చంద్రబాబు నాయుడు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నల్లయ, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అలిపిరి టోల్ ప్లాజాను ఆధునిక పరిజ్ఞానంతో తీర్చిదిద్దాలి



దర్శనం టోకెన్ల జారీని పరిశీలిస్తున్న టిటిడి ఈవో శ్యామల రావు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం అలిపిరి టోల్ ప్లాజా సెంటర్ ను అత్యాధునిక తనిఖీ కేంద్రంగా తీర్చిదిద్దేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను టిటిడి ఈవో జె. శ్యామల రావు ఆదేశించారు. టిటిడి ఈవో ఛాంబర్లో శనివారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ అత్యాధునిక తనిఖీ కేంద్రంగా అలిపిరి టోల్ ప్లాజా సెంటర్ను మార్చడం వల్ల భక్తులు ఎక్కువ సమయం వేచియుండకుండా వచ్చిన వారికి వచ్చినట్లు స్కానింగ్ చేయవచ్చు, మరింత వేగంగా లగేజీని భక్తులకు అందించవచ్చునన్నారు. భక్తుల వాహనాలు, లగేజీని తక్కువ సమయంలో స్కాన్ చేయడం వల్ల సమయం ఆదా అవుతుందన్నారు. ద్విచక్ర వాహనాలు, నాలుగు, ఆరు చక్రాల వాహనాలను మరింత వేగంగా స్కానింగ్ చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. టోల్ ప్లాజాను శాస్త్రీయంగా స్కానింగ్ చేసేందుకు వీలుగా మానవ వనరులు, సాంకేతిక పరిజ్ఞానం, క్యూ మేనేజ్మెంట్, భద్రత, సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణ, అత్యాధునిక సిసి కెమెరాల ఏర్పాటు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్లలో స్కానింగ్ చేసి లగేజీని జాగ్రత్తగా అందిస్తున్న అంశాలను పరిశీలించాలన్నారు. భక్తులు తమ లగేజీని డిపాజిట్ చేసి తిరుమల చేరుకునే సమయానికి లగేజీ సమాచారాన్ని భక్తులకు అందించే అంశంపై టిటిడి ఐటీ విభాగం, విజిలెన్స్ శాఖ కసరత్తు చేయాలన్నారు. భక్తులకు సౌకర్యవంతంగా, సమయానికి, వేగంగా, భద్రంగా లగేజీని అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

భక్తుల సౌకర్యార్థం టోకెన్ల జారీ కేంద్రాన్ని అలిపిరికి మార్చాం : టిటిడి ఈవో

శ్రీవారి మెట్టు మార్గం ద్వారా కాలినడకన వెళ్లే దివ్యదర్శనం భక్తులకు టోకెన్లను అక్కడే జారీ చేయడం వల్ల భక్తులు అసౌకర్యానికి గురౌతున్నారనే ఫిర్యాదులు రావడంతో భూదేవి కాంప్లెక్స్కు తాత్కాలికంగా శుక్రవారం సాయంత్రం నుండి మార్చామన్నారు. శ్రీవారి మెట్టు మార్గం ద్వారా కాలినడకన వెళ్లే భక్తులకు అలిపిరి భూదేవి కాంప్లెక్స్లో రోజుకు సరాసరి 5,000 టోకెన్లు జారీ చేస్తున్నామన్నారు. అలిపిరిలో పటిష్టంగా టోకెన్ల జారీ యంత్రాంగం, భక్తులకు సౌకర్యవంతంగా రవాణా సౌకర్యం, భద్రతా ఉందని ఈవో తెలిపారు. శ్రీనివాస మంగాపురంలో టోకెన్లు జారీ చేసేందుకు ఆర్కియాలజీ శాఖ అనుమతులు రాగానే అక్కడ టోకెన్లు జారీ చేస్తామన్నారు. కాలినడకన శ్రీవారి మెట్టుకు వెళ్లేందుకు భూదేవి కాంప్లెక్స్లో టోకెన్లు పొందేందుకు వచ్చిన భక్తులతో టిటిడి ఈవో మాట్లాడారు. దివ్యదర్శనం భక్తులకు టోకెన్లు జారిలో ఏదైనా ఇబ్బందులు ఉన్నాయా అని భక్తులను అడుగగా, భక్తులు సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ఉన్నతాధికారులతో కలసి అలిపిరి టోల్ ప్లాజా సెంటర్ను పరిశీలించారు. లగేజీ స్కానింగ్ కేంద్రంలోని అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. భూదేవి కాంప్లెక్స్లో దివ్య దర్శనం టోకెన్లు జారీని పరిశీలించి, భక్తులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఈవో వి. వీరబ్రహ్మం, సివిఅండ్ ఎస్వో మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, సిఈ టివి సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ ఇంటర్ సప్లిమెంటరీలో హిమజ విద్యార్థులు ప్రభంజనం


ప్రతిభ చాటిన జూనియర్ ఇంటర్ విద్యార్థులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జూనియర్ ఇంటర్ సప్లమెంటరీ ఫలితాల్లో పుత్తూరు పట్టణానికి హిమజ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారు. హిమజ కళాశాల చైర్మన్ సురేంద్ర రాజు మాట్లాడుతూ ఈ ఫలితాల్లో విద్యార్థులు ఎంపీసీ లో ముఖేష్ రాజు466 / 470, పావని ప్రియా 464, త్రిష 460, బైపీసీ గ్రూపులో అపోజ్ 432/ 440, హసీనా 422, యశ్వని 414, సిఇసి గ్రూపులో షోరన్ 474/500, దినేష్ 467, దివాకర్ 457 మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్, ఎం భాస్కర్ రాజులకు కళాశాల తరపున కృతజ్ఞతలు తెలియజేసినట్లు సురేంద్ర రాజు తెలిపారు.

ఏపి పిజిసెట్- 2025 పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎపిపిజిసెట్– 2025 నిర్వహిస్తుంది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి 4 ఏళ్ళ తరువాత తొలిసారిగా పిజిసెట్ నిర్వహించే బాధ్యతను ఉన్నత విద్యామండలి అప్పగిస్తూ ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లును కన్వీనర్గా నియమించింది. వారు పిజి సెట్ – 2025 కన్వీనర్ గా బాధ్యతలు చేపట్టిన వెంటనే పిజిసెట్ నిర్వహణకోసం కసరత్తు ప్రారంభించారు. ఎపిపిజి సెట్–2025 ఛైర్మన్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఇంచార్జీ ఉపకులపతి అయిన ఆచార్య అప్పారావు మార్గదర్శనంలో పిజిసెట్ పనులు వేగంగా సాగాయి. మార్చి నెల 31వ తేదిన రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో పిజి కోర్సు చేరే అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని ప్రకటన విడుదల చేశారు. ఈ సంవత్సరం 31సబ్జెక్టులకు పిజి ఎంట్రెన్స్ నిర్వహిస్తున్నారు. 9 నుంచి 12 వ తేదీ వరకు పిజిసెట్ పరీక్షలు షెడ్యూల్ విడుదలయ్యింది.

మహిళలను కించపరిచే సంస్కృతి వైసీపీది

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మహిళలను కించపరిచే సంస్కృతిని కొనసాగించిన వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, ప్రతిపక్ష హోదా లేకపోయినా ఆ ఫందాను ఇప్పుడు కొనసాగిస్తున్నారని, రాబోయే రోజుల్లో వైసీపీకి ఒక్క సీటు మాత్రమే వస్తుందని టిడిపి చిత్తూరు జిల్లా పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ, ఎస్సీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కుమారమ్మ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అమరావతి రాజధాని ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్ది, అభివద్ధి పథంలో ముందుకు నడపాలని ప్రయత్నిస్తున్న సీఎం చంద్రబాబు సంకల్పంపై బురద జల్లడానికి వైసీపీ శ్రేణులు కుట్రపన్నారన్నారు. జగన్కు చెందిన టీవీ ఛానల్లో ఓ డిబేట్ కార్యక్రమంలో కష్ణంరాజు అనే వ్యక్తి అమరావతి చుట్టుపక్కల ప్రాంతాల రైతులు సెక్స్ రాకెట్లు నడుపుతారని చెప్పడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా మహిళా లోకం భగ్గుమందన్నారు. 2019 నుండి 2024 వరకు రాష్ట్రంలో విధ్వంసక పాలన చేసిన జగన్మోహన్ రెడ్డికి మహిళల విలువ తెలియదని, అమరావతి రాజధాని నిర్మాణానికి ఎంతోమంది మహిళలు స్వచ్ఛందంగా తమ భూములను ఇచ్చారని గుర్తు చేశారు.

అన్న ప్రసాదానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన తేజ్ గణేష్ కుటుంబ సభ్యులు రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని డీడీ రూపంలో ఆలయాధికారులకు అందజేశారు. నిత్యాన్నదాన పథకానికి ఖర్చు చేయాల్సిందిగా సూచించారు. దాత కుటుంబానికి స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించారు.

పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు రుక్మిణి, సత్యభామ సమేత కృష్ణస్వామి పద్మసరోవరంలో తెప్పపై విహరించి భక్తులను అనుగ్రహించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : శనివారం బక్రీద్ సందర్భంగా గూడూరు, ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ పండుగ విశిష్టతను మత పెద్దలు తెలియజేశారు. అనంతరం ఒకరికొకరు ఆ లింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పెద్దల సమాధులను సందర్శించి వారిని స్మరించుకున్నారు. ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు ఈద్గా వద్ద బక్రీద్ సందర్భంగా ముస్లింలు ప్రార్థనలు చేశారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణంలోని ముస్లింలు బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద శనివారం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో నగరి నియోజకవర్గ మైనార్టీ సెల్ టిడిపి అధ్యక్షులు రఫీ అహ్మద్, గేట్ పుత్తూరు మసీదు మస్జిద్ ఏ ముఖద్దస్ ముతవల్లి మహమ్మద్ గౌస్, నగరి నియోజకవర్గ అధికార ప్రతినిధి చాను టిడిపి తెలుగు యువత ఆర్గనైజ్ సెక్రెటరీ యూనిస్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఏర్పేడు: శనివారం బక్రీద్ పండుగ పురస్కరించుకొని మండలంలోని పాపా నాయుడు పేట జామియా మసీదులో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. మత గురువు మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగాలకు ప్రతీక అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ ముత్తవల్లి లాలాసాహెబ్, కార్యదర్శి హసీం, భాష, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి తిరుపతి సిటీ: క్రికెట్ క్రీడాకారులు చిన్న వయసు నుంచే క్రికెట్ పై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లయితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించవచ్చని చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ విజయ్ కుమార్(క్రికెట్ విజయ్)తెలిపారు. ఫ్రెండ్లీ ఫైటర్స్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో మే 6 నుంచి జూన్ 6 వరకు నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు క్రికెట్ శిక్షణతో పాటు వ్యాయామంలో మెలకువలు, ఆట తీరు మెరుగుపరుచుకునే విధివిధానాలను తెలియజేయడం జరిగిందన్నా. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా క్రీడాకారులకు సర్టిఫికెట్స్, మెడల్స్, ట్రోఫీలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో సిడిసిఎ జాయింట్ సెక్రెటరీ సతీష్ కుమార్ యాదవ్, ఈసీ మెంబర్లు వెంకటరమణ, ప్రకాష్, క్రికెట్ క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ విధానాలపై ప్రపంచ వ్యాప్త వ్యతిరేకత

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ట్రంప్ విధానాలతో ఇండియాతో పాటు పలు దేశాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందని ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ కె.వి చలం పేర్కొన్నారు. శనివారం సాయంత్రం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్ లో సిపిఐ ఆధ్వర్యంలో ట్రంప్ విధానాలు భారతదేశంలో ప్రభావం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ నేపథ్యంలో సరళీకరణ, ప్రపంచీకరణలో భాగంగా ఫ్రీ ట్రేడ్ మార్కెట్ కొనసగిస్తున్న తరుణం లో ట్రంప్ సుంకాలు పెంచడంతో ప్రపంచవ్యాప్తంగా కూడా వ్యతిరేకత వ్యక్తమవుతోందని అన్నారు. మోడీ విధానాలు గమనిస్తే ఉగ్రవాదుల అణచివేత కన్నా ఆయన రాజకీయ లబ్ధి కోసమే ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. టెర్రరిస్టులను, మావోయిస్టులను అంతం చేసామని ప్రకటించిన మోడీ బీహార్లో ఇంకా అయిపోలేదు ఈ పరంపర కొనసాగుతుందని చెప్పడం కేవలం ఎన్నికల లబ్ధి కోసమేనని విమర్శించారు. ఈ సదస్సుకు సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి అధ్యక్షత వహించగా, నగర కార్యదర్శి విశ్వనాథ్ వందన సమర్పణ చేశారు.

అక్రమ గ్రావెల్ క్వారీ ఆపకపోతే అడ్డుకుంటాం : సిపిఐ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: చిత్తూరు జిల్లా నగరి రూరల్ మండలం గుండ్రాజుకుప్పం దళితవాడ ఆనుకుని ఉన్న గ్రావెల్ క్వారీలో పరిమితికి మించి గ్రావెల్ మైనింగ్ చేయడంతో పాటు, జాతీయ రహదారుల పనులకని కుంటిసాకులు చెబుతూ, తమిళనాడుకు తరలించి డబ్బులు దండుకుంటున్న క్వారీ యజమానులకు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ వార్నింగ్ ఇచ్చారు. స్థానికులతో కలిసి సిపిఐ నేతలు శనివారం క్వారీ ప్రాంతంలో పర్యటించారు. పరిమితికి మించి గ్రావెల్ తవ్వకాలు చేపట్టడంలో భాగంగా ఇష్టానుసారంగా బాంబ్బ్లాస్టింగ్ చేయడంతో గుండ్రాజుకుప్పం దళితవాడలోని ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయన్నారు. రాజకీయ అండదండలతో అక్రమంగా నడుపుతున్న యజమానులు తక్షణమే ఆపేయాలని, లేకపోతే దళితవాడ ప్రజలను భారీ ఎత్తున సమీకరించి మిషన్లను పగలగొడతామని హెచ్చరించారు.

సీఐకి అంత అత్యుత్సాహం ఎందుకు..?

- వైఎస్ఆర్సీపీ నేతలు, కార్యకర్తలనే టార్గెట్ చేస్తారా..?
- తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుపై చెవిరెడ్డి మోహిత్రెడ్డి ఫైర్



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : 'సీఐ గారు.. మీకు అంత అత్యుత్సాహం ఎందుకండీ.. పసుపు పార్టీ బ్యానర్లు మీ కంటికి కనపడలేదా..? మీరు ఏమైనా ఆ పార్టీ కార్యకర్తగా పనిచేస్తున్నారా..? పోలీసు శాఖలో పనిచేస్తున్నారా..? అంటూ చంద్రగిరి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రంలో అమలవుతున్న రెడ్ బుక్ రాజ్యాంగం అమలులో నెంబర్ వన్ సీఐగా కావాలని తపన పడుతున్నారా..? అందుకే వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్గా పెట్టుకున్నారా..? టీడీపీ నేతలు ఎవ్వరు పేరు చెడితే వారిపై కేసులు పెడతారు.. కళ్ల ముందే టీడీపీ గుండాలు రెచ్చిపోతుంటే అమాయకపు ప్రజలపై లాఠీ చార్జి చేస్తారు. అలాంటపుడు ఖాకీ చొక్కా కాకుండా పసుపు చొక్కా వేసుకోండి. మీరు చేస్తున్న అరాచకానికి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. గుర్తుంచుకోండంటూ హెచ్చరించారు. చంద్రగిరి డీఎస్పీ కార్యాలయంలో శనివారం బాధితులతో కలసి సీఐ చిన్నగోవిందు, లింగేశ్వరనగర్ పంచాయతీలో గొడవలకు కారణమైన వారిపై చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. డీఎస్పీ ప్రసాద్కు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. తిరుపతి రూరల్ మండలం లింగేశ్వరనగర్ పంచాయతీ సర్పంచ్ ముసుకు కోటేశ్వరరావు జన్మదినం సందర్భంగా తన ఇంటి వద్ద శుక్రవారం రాత్రి జన్మదిన వేడుకలు జరుపుకుంటుండగా స్థానిక టీడీపీ మహిళా నేత హేమలత, ఆమె కుమారుడు చిట్టిలు సర్పంచ్ ఆయన ఫ్లెక్సీలను చించివేశారు. దీంతో తమ ఫ్లెక్సీలు ఎందుకు చింపుతున్నారని అడిగిన సర్పంచ్ కోటేశ్వరరావుతో పాటు అతని భార్య ముని పుష్పలపై దాడి చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకుందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం చెవిరెడ్డి మోహిత్రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎక్కడైనా పల్లెల్లో ఏదైనా గొడవ జరిగితే పోలీసులు అక్కడకు వెళ్లి ఇరువర్గాలకు నచ్చజెప్పి వివాదం తీవ్రతరం కాకుండా శాంతియుత పద్దతిలో అణచివేస్తారని, తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు మాత్రం అసలు గొడవ ఏమిటి..? ఎవ్వరు ఎవ్వరిపైకి దాడి చేశారు..? గొడవలకు గల కారణాలు ఏమిటి..? అన్న ప్రాథమిక సమాచారం తీసుకోకనే సర్పంచ్ ఇంటికి బర్తడే పార్టీకి వచ్చిన గ్రామస్తులందరిపై లాఠీ చార్జి చేయడం, అక్కడ టీడీపీ ఫ్లెక్సీలు అలాగే వుండగా, వైఎస్ఆర్సీపీ ఫ్లెక్సీలను బలవంతంగా తాను సీఐ అన్న విషయం మరచి చించివేయడం, తన సిబ్బంది చేత చించివేయించడం వంటి పనులు చేశారన్నారు. అలా చేయడం పోలీసులకు తగదని హితవు పలికారు. గతంలో కూడా వైఎస్ఆర్ సీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి టీడీపీ వాళ్లపై ఫిర్యాదులు తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల వైఎస్ఆర్సీపీ సోషల్ మీడియా కార్యకర్త ఒకరు ఏదో పోస్టు పెట్టారని అతనిపై కక్షకట్టి స్థానిక ఎమ్మెల్యే నాని ఒత్తిడి చేయడంతో అక్రమంగా అరెస్టు చేసి 14 రోజుల రిమాండ్కు పంపించారన్నారు. వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలనే టార్గెట్గా పెట్టుకుని వేధింపులకు దిగుతున్న ఆ సీఐపై న్యాయ పోరాటం చేస్తామని, అంతకంటే ముందు ఆయన పైఅధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. తమ ఫిర్యాదుపై డీఎస్పీ ఏలాంటి చర్యలు తీసుకోకుంటే త్వరలో ఎస్పీని కలుస్తామని, ఆపై న్యాయస్థానంలో ప్రయివేటు కేసులు పెడతామన్నారు. లింగేశ్వరనగర్ పంచాయతీలో తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు చేసిన అరాచకం వీడియోలను కోర్టు ముందు పెట్టి ఖచ్చితంగా ఆయనపై కేసు నమోదయ్యేలా చూస్తామని, అంతకంటే ముందుగా తమ పార్టీ సర్పంచ్ ఫ్లెక్సీలు చించివేసి గొడవకు కారకులైన వారందరిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చెవిరెడ్డి మోహిత్రెడ్డి వెంట పార్టీ నేతలు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకోవడంతో పోలీసులు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు.

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనం చోరీ

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలోని రాయల చెరువు కట్ట కింద ఉన్న ఆంజనేయ స్వామి గుడి వద్ద ద్విచక్ర వాహనం చోరీకి గురైన విషయం శనివారం వెలుగు చూసింది. తిమ్మరాజు పల్లి దళితవాడకు చెందిన నెల్లేపల్లి విశ్వనాథం అమర రాజా బ్యాటరీస్ కంపెనీలో పనికి వెళ్లేందుకు శుక్రవారం ఉదయం ఏపీ 03 సి ఈ 9079 నెంబర్ గల ద్విచక్ర వాహనంలో తిమ్మరాజు పల్లి నుండి ఆంజనేయస్వామి గుడి వరకు వచ్చి ఎదురుగా ఉన్న రాయల మండపం వద్ద బైక్ పార్కింగ్ చేసి కంపెనీకి బస్సులో డ్యూటీకి వెళ్లాడు. రాత్రి 11:30 గంటలకు విధులు ముగించుకుని తిరిగి వచ్చి చూడగా బైక్ లేకపోవడంతో, చోరీకి గురైనట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ప్రభుత్వ స్టేడియంలో 15 ప్రభుత్వ పాఠశాలకు ఎంఈఓ రావుఫ్ స్పోర్ట్స్ కిట్స్ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రీడాకారుల కోరిక మేరకు స్టేడియంలో నూతన గ్యాలరీ, ఓపెన్ జిమ్, ప్రహరీ గోడలకు పెయింటింగ్ వేసి స్టేడియం అభివృద్ధి చేసినందుకు క్రీడాకారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారన్నారు. ప్రభుత్వ స్పోర్ట్స్ కిట్స్ను అందించడం శుభపరిణామం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, సుమన్ రెడ్డి, శర్మ, వెంకటేశ్వర్లు, లవ కుమార్, రవూఫ్, పీడీలు కోటేశ్వరయ్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండల పరిధిలోని ఉచ్చూరు గ్రామానికి చెందిన చిత్తూరు మునీంద్ర(25) ఈనెల మూడవ తేదీన తడ మండలం, తడ కండ్రిగ గ్రామ సమీపాన ఉన్న జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడికి వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులతో పాటు మతిస్థిమితం లేని ఇద్దరు చెల్లెలు ఉన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ్ సేవా సంస్థ వారు శనివారం మృతుడి స్వగ్రామం ఉచ్చూరుకు వెళ్లి 10,000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం సేవా సంస్థ వారు మాట్లాడుతూ, మా సేవా సంస్థ నేత్రదానం, పేద విద్యార్థులను గుర్తించి వారికి విద్యా సామగ్రిని పంపిణీ చేయుట పేదలను ఆదుకుని వారికి మా సేవా సంస్థ చేతనైన ఆర్థిక సహాయాన్ని అందించుట వంటి కార్యక్రమాలు చేస్తుందని తెలియజేశారు.

జగన్ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగం పుంజుకోవడాన్ని చూసి జీర్ణించుకోలేక, తన సొంత ఛానల్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేయించిన జగన్ రెడ్డి తక్షణమే క్షమాపణలు చెప్పాలని 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ డాక్టర్ నివేదిత మోరె డిమాండ్ చేశారు. జగన్ పాలనా కాలంలో జరిగిన కుంభకోణాల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికే ఇలాంటి నీచ పనులకు దిగజారారని ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ విమర్శించారు. తన సొంత మీడియాలో మాట్లాడిన వారి పైనా, యాజమాన్యం పైన మహిళా కమిషన్, యస్సీ, యస్టీ, మానవ హక్కుల కమిషన్ క్రిమినల్ కేసులు నమోదు చేసి, తక్షణమే అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మిన్నల్ రవి, డా.యం.ఉమేష్ రావు, మునిరాజా యాదవ్, కోట చంద్రశేఖర్, వజ్రం కిషోర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో తనిఖీలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతి రైల్వే డిఎస్పిఓపి రైల్వే స్టేషన్ పరిధిలో తిరుపతి వారి ఉత్తర్వులు మేరకు ఆర్పిహెచ్ హరి నాథ రాజు, ఆర్పిఎఫ్ ఎస్సై పెరుమాళ్, ఏఎస్ఐ కార్తికేయన్, జిఆర్పి సిబ్బంది కలిసి శనివారం సప్తగిరి ఎక్స్ప్రెస్, గరుడాద్రి ఎక్స్ప్రెస్, కాచిగూడ ఎక్స్ప్రెస్, తిరుపతి మెమో ఎక్స్ప్రెస్ రైళ్లలో గంజాయి, లిక్కర్, డ్రగ్స్ తనిఖీల నిమిత్తం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమంగా రవాణా అవుతున్నవేవీ దొరకలేదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంట్లో నాలుగో స్థానం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలలో తిరుపతి జిల్లా రాష్ట్ర స్థాయిలో నాలుగవ ర్యాంకు సాధించిందని ఆర్ఐఓ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్ఐఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో జిల్లావ్యాప్తంగా మొదటి సంవత్సరం సప్లమెంటరీ జనరల్ కోర్సులలో 7985 మంది పరీక్షలు హాజరు కాగా 51% తో 4067 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ కోర్సుల్లో 301 మంది పరీక్షలు హాజరు కాగా 53%తో 160 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం జనరల్ కోర్సుల్లో 4708 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 71% తో 3360 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 244 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 75%తో 183 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లా వ్యాప్తంగా మొదటి, ద్వితీయ సంవత్సరంలో అన్ని కోర్సులలో కలిపి 13238 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 59 శాతంతో 7770 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో రాష్ట్రవ్యాప్తంగా తిరుపతి జిల్లా నాలుగో స్థానం సాధించిందని తెలిపారు.

క్యాంపస్ లైఫ్ పై అవగాహన



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తిరుపతి ఐఐటీలో జేఈఈ అడ్వాన్స్ డ్–2025లో అర్హత పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శనివారం క్యాంపస్ లైఫ్ పై అవగాహన కల్పించారు. ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ ఓపెన్ హౌస్ ద్వారా ప్రత్యక్షంగా పాల్గొన్న విద్యార్థులకు, ఆన్లైన్ ద్వారా పాల్గొన్న విద్యార్థులకు ఐఐటి కోర్సులు, అవకాశాలు, లక్ష్యాలపై దిశా నిర్దేశం చేశారు. అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలు, డబుల్ డిగ్రీలు, బ్రాంచ్ మార్పు విధానం, హాస్టల్ వసతి, వైద్య సౌకర్యాల అవగాహన కల్పించారు. పలు విభాగాల డీన్ లు పాల్గొన్నారు.

వీఆర్కు సీఐ రవి నాయక్..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి శ్రీకాళహస్తి రూరల్ కానిస్టేబుల్ అన్వర్ బాషా ఘటనలో సీఐ రవి నాయక్పై తిరుపతి జిల్లా ఎస్పీ శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయన్ను తిరుపతి వీఆర్కు బదిలీ చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహ మూర్తిని వివరణ కోరగా విచారణ జరుగుతోందని తెలిపారు.

త్వరలోనే '22ఎ'కు విముక్తి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : రాజకీయ కక్షసాధింపులో భాగంగా నగరంలోని పలు ప్రాంతాలను 22 ఎ కింద వైసిపి నాయకులు చేర్చారని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. త్వరలోనే కూటమి ప్రభుత్వం విముక్తి కల్పిస్తుందన్నారు. శనివారం గంగమ్మగుడి ప్రాంతంలో తాతానగర్ వాసుల కృతజ్ఞతా సమావేశం జరిగింది. సర్వేనంబర్ 4048లో 2 ఎకరాల 49 సెంట్ల భూమిలో గంగమ్మగుడికి చెందిన భూమి కొంత ఉందని గతంలో 22ఏ కింద తాతానగర్ ప్రాంతాన్ని చేర్చారు. అయితే ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన వెంటనే సర్వేనంబర్ 4048 ను సబ్ డివిజన్ చేసి గంగమ్మ గుడికి 70 సెంట్లు మిగతా భూమిని తాతానగర్ వాసులకు కేటాయించి 22ఏ నుంచి విముక్తి కల్పించింది. దీంతో తాతానగర్ వాసులకు ప్రొసీడింగ్స్ కాపీలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందచేశారు. ఈ ప్రోసీడింగ్స్ త్వరగా రావడంలో పులుగోరు మురళీ, భరణి యాదవ్ ల కషి అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు.